క్లుప్తంగా

వైద్యశిబిరం వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న హరికృష్ణమాచార్యులు

జమ్మికుంట: పట్టణంలో వికాస తరంగిణి జమ్మికుంటశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధానాచార్యులు డింగరి హరికృష్ణమాచార్యులు కోరారు. 21న మహిళా ఆరోగ్య వికాస్ వైద్య శిబిరాన్ని పట్టణంలోని పాత సత్యం ఆసుపత్రి పక్కన ఏర్పాటు చేశామని, మహిళలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలపై ఉచిత పరీక్షలు, మందులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి కోఆర్డినేటర్స్ ముక్కా శివకుమార్, వీరలింగం, అంతం రాజిరెడ్డి, పుల్లూరి శ్రీనివాస్, ఎదులాపురం వెంకటేశ్, ఎలవేని సమ్మయ్య, కర్ర రజిత, తిరుమల, ఆశాజ్యోతి, పావని, భవాని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం



విద్యార్థిని సన్మానిస్తున్న ట్రస్టు సభ్యులు

గంగాధర: ఐఐటీలో సీటు సాధించినా ఆర్థిక స్థోమత లేక చదువుకు దూరమవుతానేమోనని బాధపడుతున్న విద్యార్థికి ట్రస్టు సభ్యులు అండగా నిలిచారు. మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామానికి చెందిన బొల్లబత్తిని శుభచరణ్ ఐఐటీలో మంచి ర్యాంకు సాధించాడు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో తల్లిదండ్రులు పద్మచంద్రమౌళి, మహాత్మాజ్యోతిరావుఫూలే విద్యా సంస్థల సంయుక్త సంచాలకులు శ్యాంప్రసాద్ ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్‌ను సంప్రదించారు. విద్యార్థి మొదటి సంవత్సరం చదువుకు అవసరమైన రూ.1,24,440 శనివారం అందించారు. పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని విద్యార్థిని అభినందించారు. ట్రస్టు కన్వీనర్ శ్రీనివాస్, సభ్యులు రాజేశ్వర్, సంపత్, మల్లికార్జున్‌దేవ్, మనోహర్, శరత్‌చంద్ర, కృష్ణ గోపాల్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డు కొత్తపల్లిలో మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. ప్రజలకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించిఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అనంతరం మురుగుకాలువలను శుభ్రం చేయించి, రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు.

మిడ్‌డే మీల్.. బర్డెన్

- మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు అందని బకాయిలు
- అప్పుచేసి విద్యార్థులకు ఆహారం వండుతున్న వైనం

హుజూరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న వంట నిర్వాహకులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు నెలలుగా ప్రభుత్వం నుంచి బిల్లులు అందకపోవడంతో అప్పులు తెచ్చి భోజనం వండి పెడుతున్నారు. ఇది వారి జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

బిల్లుల జాప్యం

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే ఏజెన్సీలు ప్రతినెలా సరుకులు, కూరగాయలు, గ్యాస్, వంట కార్మికుల జీతాలకు రూ.వేలు ఖర్చు చేయాలి. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో బయట వడ్డీలకు అప్పు తెచ్చి మరీ పిల్లలకు భోజనం వండి పెడుతున్నారు. అప్పులు తీర్చలేక, వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఏజెన్సీ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఏజెన్సీలకు అప్పు పుట్టక సరుకులు కొనలేక భోజనం అందించడం ఆగిపోయే పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు పెరిగిన ధరలు, నూతన మెనూ అమలు వంట కార్మికులకు సవాలుగా మారింది.

బియ్యం మాత్రమే సరఫరా

1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కో విద్యార్థికి రూ.6.19, 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు రూ.9.29, 9వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థికి కోడిగుడ్డుతో కలుపుకొని రూ.10.67 చొప్పున చెల్లిస్తున్నాయి. ప్రభుత్వాలు బియ్యం మాత్రమే సరఫరా చేస్తుండగా కూరగాయలు, వంట సరుకులు, గ్యాస్, నిత్యావసర వస్తువులు ఏజెన్సీ నిర్వాహకులే దుకాణాల్లో కొనుగోలు చేయాలి. మార్చి నుంచి జూన్ వరకు బిల్లులు రాలేదు. కోడిగుడ్డు బిల్లులు సైతం రాక నిర్వహణ భారమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



హుజూరాబాద్‌లోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో భోజనం వండుతున్న నిర్వాహకులు

అందని గౌరవ వేతనం

డివిజన్ వ్యాప్తంగా 434 ప్రభుత్వ పాఠశాలలో 328 మంది మధ్యాహ్న భోజన కార్మికులున్నారు. వీరికి గౌరవ వేతనంగా కేంద్రప్రభుత్వం రూ.1000, రాష్ట్ర ప్రభుత్వం రూ.2000 కలిపి మొత్తం రూ.3000 చెల్లిస్తోంది. కానీ గౌరవ వేతనం కూడా రావడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు. వంట బిల్లులు రాక కిరాణషాపులు, కూరగాయల దుకాణాల్లో ఉద్దెర పెరిగిపోతుందని వాపోతున్నారు.

నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య

మండలం	హైస్కూళ్లు	అప్పర్ ప్రైమరీ స్కూళ్లు	ప్రైమరీ స్కూళ్లు	మొత్తం విద్యార్థులు
హుజూరాబాద్	13	07	32	2165
జమ్మికుంట	10	05	33	1587
వీణవంక	10	08	27	1098
ఇల్లందకుంట	07	05	15	892
సైదాపూర్	10	--	35	1204
మొత్తం	50	25	142	6947

ఇబ్బంది పడుతున్నాం



గత విద్యా సంవత్సరంలో రెండు నెలలు ఇప్పుడు జూన్ నెల వేతనం రాలేదు. జీతాలు రాక ఇబ్బంది పడుతున్నాం. డబ్బులు వస్తేనే మా ఇళ్లు గడుస్తది, 18 ఏళ్ల నుంచి స్కూల్‌లో వంట చేస్తున్నాం, కట్టెల పొయ్యిపై వంట కష్టంగా ఉంది. గ్యాస్ సిలిండర్ సబ్సిడీపై ఇప్పించాలి. ప్రభుత్వం బిల్లులు విడుదల చేయాలి.

– పల్లెర్ల కళావతి, సిరిసేడు, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు

సరుకులు కొనడం కష్టం



ప్రస్తుతం కూరగాయలు, కోడిగుడ్లు, నూనె, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. మార్చి నుంచి బకాయిలు రాలేదు. అప్పు తెచ్చి పిల్లలకు భోజనం వడ్డించడం కష్టంగా ఉంది. బిల్లులు రాకపోవడంతో సరుకులు కొనడం కూడా కష్టంగా మారింది. మా పరిస్థితిని ప్రభుత్వం అర్థం చేసుకోవాలి.

– నీల బుచ్చిమల్లమ్మ, వీణవంక, మధ్యాహ్న భోజన నిర్వాహకులు

త్వరలో బిల్లులు



వంట ఏజెన్సీలకు బిల్లుల చెల్లింపులో జాప్యం వాస్తవమే. సమస్యను పరిష్కరించడానికి ఉన్నతాధికారులు కృషి చేస్తున్నారు. త్వరలోనే పెండింగ్ బిల్లులకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యేలా జిల్లా అధికారులు నివేదికలు అందజేశారు. నిర్వాహకులు, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూస్తున్నాం.

– భూపతి శ్రీనివాస్, ఎంఈవో, హుజూరాబాద్

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



పంటను పరిశీలిస్తున్న అధికారులు

హుజూరాబాద్: రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తే అధిక లాభాలు ఉంటాయని ఏడీఏ సునీత అన్నారు. మున్సిపాలిటీ పరిధి ఇప్పలనర్సింగాపూర్‌లో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. రైతులు వరి, పత్తి, మొక్కజొన్న, తదితర పంటలపై ఆధారపడుతున్నారని, వాతావరణ మార్పులు, మార్కెట్ అసమానతలు, నీటి లభ్యత రైతులను ఆర్థిక అస్థిరత వైపు నడిపిస్తున్నాయని, డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి లేకపోవడంతో ప్రభుత్వం విదేశాల నుంచి ఆయిల్ పామ్ దిగుమతి చేసుకుంటుందన్నారు. సాగు పెంచాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలన్నారు. ఏవో భూమిరెడ్డి, హార్టికల్చర్ అధికారి మంజువాణి, ఏఈవో నిఖిల్, ఫీల్డ్ ఆఫీసర్ వేణు ఉన్నారు.

22న స్పాట్ అడ్మిషన్

రామడుగు: మండలంలోని వెదిర కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ గ్రూప్‌లో 20, ఎంపీహెచ్‌డబ్ల్యు (ఎఫ్) గ్రూప్‌లో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని స్పాట్ అడ్మిషన్ 22న ఉంటుందని కళాశాల ప్రత్యేకాధికారి కవిత ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

సీఏ కోర్సుపై అవగాహన



మాట్లాడుతున్న గందె శ్రీనివాస్

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు శనివారం సీఏ కోర్సుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సికాస చైర్మన్ చార్టెడ్ అకౌంటెంట్ గందె శ్రీనివాస్ మాట్లాడుతూ.. అన్ని కోర్సుల కంటే సీఏ కోర్సుకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, మార్కెట్‌లో చార్టెడ్ అకౌంటెంట్ కోర్సుకు డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హర్జిత్‌కౌర్, పీజీటీ ఉపాధ్యాయులు అసిఫ్ అలీ, అందె సురేందర్, పి రాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



అభినందిస్తున్న కరస్పాండెంట్, డైరెక్టర్లు, లెక్చరర్స్

జమ్మికుంట: శాతవాహన విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షా ఫలితాలో పట్టణంలోని చాణక్య డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. కళాశాల కరస్పాండెంట్ దబ్బెట విజయరవీందర్ మాట్లాడుతూ.. యూనివర్సిటీ స్థాయిలో హుజూరాబాద్ డివిజన్‌లో మొదటి స్థానాన్ని సాధించారని, విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ప్రభాకర్, శ్రీనివాస్, విజేందర్‌రెడ్డి, చిరంజీవి, శివకుమార్, ప్రిన్సిపల్ వంశీకృష్ణ అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నూతన కమిటీ



రాజారాం, రమేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని పాత మార్కెట్‌లో జమ్మికుంట మినీ లెదర్‌పార్క్ చర్మ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పాత కమిటీని రద్దు చేసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మొలుగూరి రాజు, జన్న కొండయ్య, అధ్యక్షుడిగా రామంచ రాజారాం, ప్రధాన కార్యదర్శిగా మడిపల్లి రమేష్, ఉపాధ్యక్షులుగా మారెపల్లి పోశెట్టి, గద్దపాక భూమయ్య, సముద్రాల రవి, పులివీరాస్వామి, సంయుక్త కార్యదర్శులుగా ఈదునూరి సరోజన, మంద రాధ, మడిపల్లి లక్ష్మి, ప్రచార కార్యదర్శిగా ఈదునూరి కిషోర్, కోశాధికారిగా చిట్యాల మొగిలి, ముఖ్య సలహాదారులుగా రాచపల్లి మనేస్, శనిగరపు సంపత్, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

సంక్షిప్త వార్తలు

● అవగాహన ఒప్పందం

హుజూరాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగం– జమ్మికుంటలోని కేంద్ర ప్రభుత్వం సంస్థ కృషి విజ్ఞానం కేంద్రంతో శనివారం విద్యా, పరిశోధన అంశాలపై పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. జంతుశాస్త్రానికి సంబంధించి విద్యా, ప్రయోగ, క్షేత్ర పర్యటన, పరిశోధన, శిక్షణ అంశాల్లో పరస్పర సహకారం అందించుకుంటాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరాదేవి, జంతుశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ వకుళాభరణం స్వరూపరాణి తెలిపారు. కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ .వెంకటేశ్వరరావు, శాస్త్రవేత్తలు వేణుగోపాల్, ప్రభాకర్, విజయ్, మహేష్ తదితరులున్నారు.

● ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి

జమ్మికుంట: సమస్యలపై ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఓఫంక్షన్ హాల్‌లో జమ్మికుంట, ఇల్లందకుంట, హుజూరాబాద్ మండలాల్లోని ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక, వ్యవసాయ కూలీలు, పేద, మధ్య తరగతి ప్రజలపై పన్నుల భారం మోపుతూ పరోక్ష దోపిడీ కొనసాగిస్తుందని ఆరోపించారు. పెట్టుబడిదారుల కొమ్ముకాస్తుందని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు తగ్గాయని, కొత్త పరిశ్రమలు సృష్టించక పోగా ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని నిర్వీర్యం చేస్తుందని, కులమత రాజకీయాలు చేస్తుందన్నారు, నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి పని గంటలు పెంచుతూ ఉద్యోగ భద్రత లేకుండా చేస్తు పెట్టుబడి దారులకు అనుకూలంగా పని చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేయకుండా ప్రజా వ్యతిరేకత మూటకట్టుకుంటుందన్నారు.

● జమ్మికుంటకు అరుదైన గౌరవం

జమ్మికుంట: రాష్ట్రంలో స్వచ్ఛ సర్వేక్షణ్ నిర్వహణపై జమ్మికుంట మున్సిపాలిటీకి 17వ స్థానం దక్కడం సంతోషంగా ఉందని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ అన్నారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ... దేశంలో జమ్మికుంట మున్సిపాలిటీ 217వ స్థానం సాధించడం హర్షనీయమని, గతంలో ఇంటి పన్నుల వసూలులో రెండు ఆర్థిక సంవత్సరాల్లో మొదటి స్థానం దక్కిందని గుర్తు చేశారు. మున్సిపల్‌కు అరుదైన గౌరవం దక్కినందుకు కృషి చేసిన ప్రజా ప్రతినిధులు, గత పాలక వర్గం సభ్యులు, మున్సిపల్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

● పైలెట్ ప్రాజెక్టుతో ప్రజలకు లబ్ధి

చొప్పదండి: పైలెట్ ప్రాజెక్టు ద్వారా మండలంలోని చిట్యాలపల్లి గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం లబ్ధి చేకూర్చారని కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గ్రామంలో శనివారం పల్లెపల్లెకు కాంగ్రెస్ జెండా సబ్బండ వర్గాలకు ప్రజా ప్రభుత్వ అండా అనే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్, వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, ఎన్నం మనోహర్, గుర్రం రాజేందర్ రెడ్డి, నిజానపురం చందు, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, ముద్దం తిరుపతిగౌడ్, పురం రాజేశం పాల్గొన్నారు.

● టికెట్లు తనిఖీ చేసిన డీఎం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం బస్టాండ్‌లో శనివారం హుజూరాబాద్ డీఎం రవీంద్రనాథ్ టికెట్లు తనిఖీ చేశారు. కరీంనగర్, వరంగల్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోని పాయింట్ల వద్ద ఆపాలని డ్రైవర్లకు సూచించారు. సురక్షితంగా గమ్యం చేరడానికి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాలని ప్రయాణికులకు సూచించారు.

● రక్షణ కిట్లు అందజేత

గన్నేరువరం: మండల కేంద్రంలోని గీత కార్మికులకు శనివారం తిమ్మాపూర్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కాటమయ్య రక్షణ కిట్లు అందజేశారు. అలాగే వివిధ గ్రామాల గీత కార్మికులకు ట్రైనర్స్ పొన్నం వెంకటేశ్, వెంగలి తిరుపతి, గుర్రం శ్రీనివాస్, బత్తిని శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. ఎక్సైజ్ ఎస్సై భారతి మాట్లాడుతూ... గీత కార్మికులకు వృత్తిలో భాగంగా రక్షణ కిట్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు తిరుపతి, మండల కోశాధికారి రాజ్‌కోటి, నాగుల కనకయ్య, మల్లేశం, మల్లయ్య, లక్ష్మీరాజాం, అంజయ్య, రమణ, బండారి రవీందర్, రాము, రాములు, శ్రీనివాస్, చెక్కిళ్ల చంద్రయ్య, ఎక్సైజ్ కానిస్టేబుల్ జి.నరేశ్, ఏ.కొండల్ రెడ్డి, ధనలక్ష్మి వివిధ గ్రామాల గీత కార్మికులు పాల్గొన్నారు.

● బియ్యం అందజేత

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్ గ్రామ శివారు మోత్కులపల్లెకు చెందిన గోవిందు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నాయకుడు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి శనివారం పరామర్శించి యాభై కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి రవికుమార్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ న్యాలపట్ల కనుకయ్య, యూత్ మండల ఉపాధ్యక్షుడు లింగంపల్లి హరీష్, నర్సయ్య, లక్ష్మన్, సత్తయ్య, కుమార్, ప్రసాద్, నర్సింగం, రజ్జి, శ్రీనివాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

● విద్యార్థుల ప్రతిజ్ఞ

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయంలో శనివారం హౌజ్ లీడర్స్, క్లాస్ లీడర్స్ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ నరేశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులచే ప్రమాణ స్వీకారం చేయించి బ్యాడ్జీలు అందించారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అందిపుచ్చుకోవాలని, సమాజానికి ఉపయోగపడే పనులు చేపట్టాలని కోరారు.

● బూడిద లారీ బోల్తా

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్‌లో శుక్రవారం అర్ధరాత్రి బూడిద లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడింది. కరీంనరగ్ నుంచి హుజూరాబాద్ వెళ్తున్న ఆటోను లారీ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టి రోడ్డు పక్కన బోల్తా పడింది. డ్రైవర్ నిద్ర మత్తు కారణంగానే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

● ఇద్దరికి తీవ్రగాయాలు

శంకరపట్నం: కేశవపట్నంలో శనివారం రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు...తిమ్మాపూర్ మండలం మొగిళిపాలెంకు చెందిన మాజిద్ (22) మరో వ్యక్తితో కలిసి కేశవపట్నం ప్రధాన రోడ్డు వైపు వెళ్తుండగా సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్‌కుచెందిన కుమార్ (26) కేశవపట్నం నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా హెడ్‌కానిస్టేబుల్ రామచంద్రం 108లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

● కుంట ఆక్రమణపై ఫిర్యాదు

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ గ్రామంలోని జక్కయ్యవారి కుంట ఆక్రమణకు గురైందని ఓ ఆయకట్టు రైతు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 1956లో కుంటను నిర్మించినట్లు రెవెన్యూ రికార్డులు సూచిస్తున్నాయని, వర్షాలకు వరద నీరు కుంటలోకి చేరితే వానాకాలం, యాసంగి రెండు పంటలు వరిసాగు చేసుకున్నామని, తూం ద్వారా నీరు రాకుండా కట్టను ధ్వంసం చేశారని ఇరిగేషన్ అధికారులు ఆక్రమణపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరాడు.

● శంకరపట్నంలో కుండపోత వాన

శంకరపట్నం: మండలంలో శనివారం సాయంత్రం కుండపోత వాన కురిసింది. కేశవపట్నం మెయిన్ రోడ్డు జలమయమైంది. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



రామడుగు: వెలిచాల జిల్లా పరిషత్ పాఠశాలలో బోనాల వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు



గన్నేరువరంలో ఎల్లో కలర్ డే



గంగాధర: గోరింటాకుతో విద్యార్థులు, టీచర్లు

ఘనంగా బోనాల వేడుకలు

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు డప్పు చప్పుళ్ల మధ్య బోనాల ఊరేగింపు, ప్రత్యేక పూజలు చేసి దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారు, పోతరాజుల వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే వివిధ పాఠశాలల్లో గోరింటాకు, ఎల్లో కలర్ డే నిర్వహించారు.



గంగాధర మండల కేంద్రంలో



చొప్పదండి: బోనాలతో వెళ్తున్న విద్యార్థినులు



మానకొండూర్ బోనాలతో విద్యార్థులు



ఇల్లందకుంటలో...



జమ్మికుంట: నృత్యం చేస్తున్న విద్యార్థినులు



హుజూరాబాద్: పోతరాజుల వేషధారణలో విద్యార్థులు

ముగిసిన అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



మాట్లాడుతున్న అతిథి

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(అటానమస్) కళాశాలలో ఏఐసీటీఈ శిక్షణ, అభ్యాస అకాడమీ సౌజన్యంతో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అటానమస్ అండ్ కనెక్టెడ్ ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ అంశంపై ఈనెల 14 నుంచి 19 వరకు నిర్వహించిన స్పాన్సర్డ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారం ముగిసిందని కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. ఏఐసీటీఈ–అటల్ అకాడమీ మంజూరు చేసిన రూ.3.50లక్షల గ్రాంటుతో నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జె. సుమిత్ సాయి వెల్లడించారు. ఈ 6 రోజుల కార్యక్రమంలో పలువురు ప్రముఖ విద్యావేత్తలు, నిపుణులు పాల్గొని తమ అనుభవాలు, ఆలోచనలను పంచుకున్నారు. శనివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లోని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ అండ్ హెడ్ డాక్టర్ పి.సతీశ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎలక్ట్రిక్ వాహనాల విప్లవానికి పరిశోధన ఆవిష్కరణల ద్వారా తోడ్పడాలని అధ్యాపకులను ప్రోత్సహించారు. సర్టిఫికెట్లు పంపిణీ చేశామని కోకన్వీనర్ డాక్టర్ ఎం.మణిక రోస్‌లిండ్ ఫ్రాంక్లిన్ తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.అనిల్‌కుమార్, డీన్ అకడెమిక్స్ డాక్టర్ పి.కె.వైశాలి, ప్రోగ్రాం కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, కోకన్వీనర్ డాక్టర్ ఎం.మణికందన్, కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.రమేశ్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైకిళ్లు పంపిణీ



జమ్మికుంట: పీఎం నరేంద్ర మోదీ కానుకగా ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని బాలుర, బాలికల పాఠశాలల్లోని విద్యార్థులకు ఎంఈవో హేమలత ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదినం పురస్కరించుకొని, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) నిధులతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు. హెచ్ఎంలు సదానందం, సుధాకర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజు, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబం తీహార్ జైలుకే..



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

కరీంనగర్ కార్పొరేషన్: రూ.లక్షల కోట్ల ప్రజల సొమ్మును దోచుకున్న కేసీఆర్ కుటుంబం తీహార్ జైలుకు వెళ్లడం ఖాయమని పీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం అన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తరువాత తొలిసారి కరీంనగర్‌కు వచ్చిన ఆయనకు శనివారం పార్టీ శ్రేణులు స్వాగతం పలికాయి. అల్గునూరు చౌరస్తా నుంచి డీసీసీ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టాయి. అనంతరం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ ప్రభుత్వం దోచుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.80వేల కోట్లు దోచుకొన్న వాళ్ల త్వరలో జైలుకు వెళ్తారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే 60వేల ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కట్ల సతీశ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్, లింగంపల్లి బాబు, సముద్రాల అజయ్, బాలబద్రి శంకర్, బొబ్బిలి విక్టర్, అస్తపురం రమేశ్, స్వరూప పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిబాపూలే విద్యార్థికి ట్రిపుల్ ఐటీలో సీటు



మానకొండూర్: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థిని ఏకుల సుప్రియకు ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. ప్రిన్సిపాల్ లవీన, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.